

నేటినుంచి పీజీ పరీక్షలు
కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం మొదటి సంవత్సరం ఎక్స్ అభ్యర్థులకు సోమవారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు.
- 8లో▸



కాజీపేట జంక్షన్‌లో రైల్వే ఏజీఎం తనిఖీలు
కాజీపేట జంక్షన్‌లో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ తనిఖీలు చేపట్టారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
31.2°/20.1°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చలితో పాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు కేంద్రమంత్రి బండి సంజయ్ రాక

ములుగు: కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయమంత్రి బండి సంజయ్ నేడు(సోమవారం) జిల్లాకేంద్రానికి రానున్నారు. ఉదయం 10గంటల 30 నిమిషాలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంపూర్ణత అభియాన్ అస్పిరేషనల్ బ్లాక్‌గా ఎంపికైన కన్నాయిగూడెం మండలంలో మూడు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అక్కడి నుంచి వెంకటాపురం(ఎం) మండలంలోని నందిపహాడ్‌ను సందర్శించి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లనున్నారు.

వీడియో సమావేశ మందిరంలో ప్రజావాణి

ములుగు: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సమీక్ష చేపట్టనున్న కారణంగా నేడు(సోమవారం) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వీడియో సమావేశ మందిరానికి మార్చినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాములు

ములుగు రూరల్: టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా బోడ రాములను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా బోడ రాములు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న, జాతీయ అధ్యక్షుడు కేదాసి మోహన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పత్తి మిల్లులకు సెలవు

భూపాలపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) పత్తి కొనుగోళ్లను నిలిపివేయాలని నిర్ణయించారు. పత్తి దిగుమతులు చేయబోమని జిన్నింగ్ ఇండస్ట్రీస్ యజమానులు తెలిపారని, జిల్లాలోని పత్తి రైతులు గమనించి పత్తిని మిల్లులకు తీసుకురావద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి కనకశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పూజల కలకలం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కుదురుపల్లి వాగు వద్ద అటవీప్రాంతంలో పూజలు నిర్వహించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం అటవీ ప్రాంతంలో పూజలు చేస్తున్న విషయం తెలియడంతో స్థానికులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పూజలు చేస్తుండడంతో క్షుద్రపూజలా.. లేదా అటవీ దేవతలకు ఏమైనా పూజలు చేశారా తెలియాల్సి ఉంది.

నియామకం



రేగొండ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేరుగు విజయ్‌కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ..బీసీ సామాజిక వర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మొగుళ్లపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల పరిధిలోని ఆకినపల్లి, పర్లపల్లి, పెద్దకోమటిపల్లి, పోతుగల్లు, వేములపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం క్వింటాల్ వరి ధాన్యానికి రూ.2,320 ఇస్తుందని చెప్పారు. సాధారణ రకానికి రూ.2,300 ఇస్తున్నట్లు తెలిపారు. క్వింటా సన్న ధాన్యానికి అదనంగా మరో రూ.500 బోనస్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

అవార్డు నోటీసులకే పరిమితం..

తాడిచర్ల జెన్‌కో పరిధిలోని కాపురం గ్రామంలో ఉన్న ఆబాది భూముల సేకరణ సమయంలో ఆరు ఎకరాల పైచిలుకు భూమిని అధికారులు మరిచిపోయారు. దీంతో ఆ నిర్వాసితులు తమకు పరిహారం రాలేదని పలుమార్లు అర్జీలు పెట్టుకున్నారు. దీంతో అనంతరం జెన్‌కో అధికారులు మళ్లీ సర్వే నిర్వహించి 6.31 ఎకరాల (3.25 ఎకరాల శిఖం భూమితో కలిపి) భూమితో మూడేళ్ల క్రితం గెజిట్ ప్రకటన చేశారు. దీంతో నిర్వాసితులు ఇక తమకు పరిహారం అందుతుందని కష్టాలు తీరాయని భావించారు. ఈ ఏడాది జూలైలో అవార్డు ప్రకటించారు. నిబంధనల ప్రకారం అవార్డు ప్రకటించిన పదిరోజుల లోగా నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా పరిహారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు.



పరిహారమేది


ఎదురుచూస్తున్న భూ నిర్వాసితులు

- అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- జెన్‌కో తీరుతో ఇబ్బందులు

మల్హర్: తాడిచర్ల జెన్‌కో పరిధిలోని కాపురం, తాడిచర్ల గ్రామాల్లోని భూ నిర్వాసితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. నిర్వాసితులు అడిగినప్పుడల్లా ఇదిగో అదిగో అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. తాడిచర్ల జెన్ కో అధికారుల తీరుతో ఇబ్బందులు పడుతున్న బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయి. పరిహారం అందకపోవడానికి నిధుల లేమి ప్రధాన కారణమని తెలుస్తోంది.

నిర్వాసితుల వివరాలు...

కాపురం గ్రామానికి చెందిన పదిహేను మంది నిర్వాసితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాపురం గ్రామంలోని (అవార్డు నోటీసు ప్రకారం) సర్వే నంబర్ 488లో చింతల లక్ష్మయ్యకు చెందిన 6గుంటలు, చింతల రాజయ్యకు సర్వే నంబర్ 488, 489లో 4గుంటల చొప్పున, తోట కిష్టయ్యకు 488లో 4గుంటలు, కూన గట్టయ్యకు 488, 489లో 9 గుంటలు, శీలం లక్ష్మయ్యకు 488లో 7 గుంటలు, 489లో 7 గుంటలు, 574లో మూడున్నర గుంటలు, శీలం రమేష్‌కు 488లో 7గుంటలు, 489లో 7గుంటలు, 574లో 3గుంటలు, శీలం గౌరమ్మకు 488, 489లో 7గుంటల చొప్పున, భీముని పోచయ్యకు 489లో 4గుంటలు, చింతల సమ్మక్కకు 489లో 4గుంటలు, రావుల సమ్మయ్యకు 4గుంటలు, ఇందారపు చంద్రయ్యకు 4గుంటలు, కొత్తపల్లి రాజేష్‌కు 7గుంటలు, కొత్తపల్లి శైలజకు 574లో ఒక గుంట, ఇందారపు సారయ్యకు 586లో ఒక ఎకరం ఉంది. నిర్వాసితులకు ఎకరానికి రూ.14.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు జూలై 31, 2024న అవార్డు కాపీలు అందజేసి, అక్విటెన్స్‌లపై నిర్వాసితులతో సంతకాలు కూడా తీసుకున్నారు. అవార్డు పాస్ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా తమకు ఎందుకు పరిహారం చెల్లించలేదో అర్థం కాకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.



కాపురం విలేజ్ (ఫైల్)



నిర్వాసితులకు అందించిన అవార్డు కాపీ

పైసలు లేవంటాండ్లు..



నాకున్న నాలుగు గుంటల భూమికి సంబంధించి పరిహారం ఇస్తామని చెప్పి అధికారులు తీసుకువచ్చిన పత్రాలపై మూడు నెలల కింద సంతకాలు చేశాను. ఇప్పటివరకు ఖాతాలో పైసలు పడలేదు. మూడు, నాలుగు సార్లు భూపాలపల్లి సార్ల వద్దకు వెళ్తే పైసలు లేవు, రేపు, మాపు డబ్బులు వేస్తామంటున్నారు. సంతకాలు చేసి మూడు నెలలకు పైగా గడుస్తున్నా నాకు డబ్బులు రాలేదు. అధికారులు తొందరగా డబ్బులు ఇయ్యాలే.

- భీముని పోచయ్య, నిర్వాసితుడు, కాపురం, మల్హర్

నిధులలేమితో జాప్యం?

అవార్డు కాపీలు అందుకొని అక్విటెన్స్‌లపై సంతకాలు పెట్టిన నిర్వాసితులకు నిధుల లేమి కారణంగానే పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. 3ఎకరాల పైచిలుకు భూమికి సంబంధించిన 15 మంది నిర్వాసితులకు సుమారు రూ.50లక్షలు అవసరమవుతాయి. ఈ అవార్డుకు సంబంధించి జెన్‌కో అధికారులు ఆర్డీఓ ఖాతాలో నగదు జమ చేయకపోవడంతో పరిహారం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పరిహారం చెల్లింపు కోసం నిర్వాసితులు ఆర్డీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా బడ్జెట్ రాలేదంటూ.. రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బడ్జెట్ లేకుండానే అవార్డు కాపీలు అందించి, అక్విటెన్స్‌లపై తమ సంతకాలు తీసుకొని పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడమేంటని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పరహారం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు. దీనిపై భూపాలపల్లి ఆర్డీఓ మంగీలాల్‌ను వివరణ కోరగా బడ్జెట్ లేకపోవడంతోనే పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. బడ్జెట్ కేటాయింపుపై జెన్‌కో సంస్థకు నివేదిక ఇచ్చామని, మూడు, నాలుగు రోజుల్లో నిర్వాసితులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీజే పాటలకు స్టెప్పులేస్తున్న విద్యార్థులు





బైబై టెక్నోజియాన్-24

నిట్ వరంగల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న టెక్నోజియాన్-24 వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. చివరి రోజు పలు ఈవెంట్స్ ప్రదర్శనలతో పాటు రాత్రి డీజే నైట్‌లో విద్యార్థులు హోరెత్తించారు. నిట్ ఆడిటోరియం, సెమినార్ హాల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సాక్ మైదానంలో ఆటా పాటలతో సందడి చేశారు.

- కాజీపేట అర్బన్

- వివరాలు 8లో▸

సామూహిక దీపాలంకరణ

కాళేశ్వరం: కార్తీకమాసం ప్రతిరోజు సామూహిక దీపోత్సవం, ఆకాశదీపం వెలిగించే కార్యక్రమాలను శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అర్చకులతో పాటు సామూహిక దీపోత్సవ కార్యక్రమం, ఆకాశ దీపం వెలిగించే కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ అవధాని మోహన్‌శర్మ ఆధ్వర్యంలో సుమారు 50మంది మంథని, చెన్నూర్, కాళేశ్వరం బ్రాహ్మణులతో సహస్ర ఆవర్తనాలతో సామూహిక గణపతి అభిషేకం నిర్వహించారు. సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు మట్టి ప్రమిదలు, ఒత్తులు, నూనె దేవస్థానం నుంచి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే పూజలు..

కాళేశ్వరం ఆలయంలో కరీంనగర్ మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

10,921 ఇళ్ల సర్వే

ములుగు: సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల, రాజకీయ రంగాల్లో చేపడుతున్న ఇంటింట సర్వేలో భాగంగా జిల్లాలో రెండవ రోజు 1,005 బ్లాక్‌లలో 713 మంది ఎన్యుమరేటర్లు 10,921 ఇళ్లను సర్వే చేశారు. దీంతో రెండు రోజుల్లో 97,552 ఇళ్లకు 17,150 ఇళ్ల సర్వే పూర్తయింది. ఆదివారం వరకు 17.58 శాతం సర్వే విజయవంతంగా పూర్తయినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు.

సర్వే వివరాలు

మండలం	ఎన్యుమరేషన్ బ్లాకులు	ఎన్యుమరేటర్లు	10వ తేదీ	పూర్తయినవి సర్వే
ములుగు	179	148	2,135	3,395
వెంకటాపురం(ఎం)	95	81	1,211	1,909
గోవిందరావుపేట	101	77	1,147	1,836
ఎస్ఎస్‌తాడ్వాయి	110	67	1,061	1,692
ఏటూరునాగారం	104	64	1,050	1,574
కన్నాయిగూడెం	41	32	377	591
మంగపేట	124	104	1,951	2,862
వెంకటాపురం(కె)	146	75	1,053	1,731
వాజేడు	105	65	936	1,560
మొత్తం	1,005	713	10,921	17,150

హామీలపై ఎమ్మెల్యేలను నిలదీయాలి

- కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హన్మకొండ: బీసీలకు ఇచ్చిన హామీలపై ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలను నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డిలో ఏడాది క్రితం బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు అనేక హామీలు ఇచ్చిందని, ఓట్ల కోసం దొంగ హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కొత్త పథకాలు ఏమో కానీ.. ఉన్న వాటిని ఎగ్గొటిందని, వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదని, అందుకే ఇంటింటి సర్వే కోసం వెళ్తున్న అధికారులను ఆరు గ్యారంటీలు, 420 హామీలపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. కుల గణనలో 75 ప్రశ్నలు ఎందుకని ప్రశ్నించారు. ఆదాయం, ఫ్రిజ్, ఏసీల వివరాలు అడుగుతుంటే పథకాల కోత కోసమేనని ప్రజలు భావిస్తున్నారని, సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రభుత్వాధికారులపై ఉందన్నారు. రేవంత్‌రెడ్డి బీసీల కోసం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. తమిళనాడులో అమలు చేస్తున్న 65 శాతం రిజర్వేషన్ల అమలుపై బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం అధ్యయనం చేసిందని, చిత్తశుద్ధి ఉంటే ఆ రాష్ట్రం మాదిరిగా తెలంగాణలో అమలు చేయవచ్చన్నారు. రూ.3 లక్షల ఆదాయమున్న ప్రతీ బీసీ కుటుంబానికి ఇస్తామన్న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. మండలానికో గురుకులం, నియోజకవర్గానికో డిగ్రీ కాలేజీ, జిల్లా కేంద్రంలో బీసీ ఐక్యతా భవనం, బీసీలకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణం ఎక్కడికి పోయాయని నిలదీశారు. బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు కేటాయించారని, అందులో ఎంత ఖర్చు చేస్తారో ఎవరికీ తెలియదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం రేవంత్ ఆయా వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే మా ఎమ్మెల్యేల పైన దాడులు చేస్తున్నారని, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేయి విరగ్గొట్టినంత పని చేశారన్నారు. హామీ మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక భరోసా కార్యక్రమం వెంటనే ప్రారంభించాలన్నారు. అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరపున నిలదీస్తామని, కాంగ్రెస్ మోసాలను ఎండగడతామన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్, పులి రజినీకాంత్, వీరేందర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై నేతలు

ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



బీఆర్ఎస్ కార్యకర్తల భారీ ర్యాలీ..

కేటీఆర్ హనుమకొండ పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. నగర శివారు కరుణాపురం ప్రాంతంలో జరిగిన పార్టీ నాయకుడు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు కూతురు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కాజీపేటలోని కడిపికొండ బ్రిడ్జి నుంచి హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని ప్రెస్‌మీట్ అనంతరం హనుమకొండ భవానీనగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు.

సొసైటీలకు బిల్లులు చెల్లించాలి

వాజేడు: గిరిజన సొసైటీలకు ఇసుక బిల్లులు వెంటనే చెల్లించాలని.. ఆదివాసీల సొమ్మును దోచుకుంటే ఉద్యమిస్తామని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సిమూర్తి మండిపడ్డారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు అధ్యక్షతన మండలపరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సిమూర్తి మాట్లాడుతూ ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇసుక క్వారీల ద్వారా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటుందన్నారు. ఏళ్లు గడుస్తున్నా గిరిజన ఇసుక సొసైటీలకు రావాల్సిన బిల్లులను చెల్లించడం లేదని ఆరోపించారు. 2021 సంవత్సరం నుంచి ఇసుక డీడీల రూపంలో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు వచ్చాయన్నారు. కానీ గిరిజన సొసైటీలకు రావాల్సిన వందల కోట్ల రూపాయలను తమ రాజకీయ అవసరాల కోసం ప్రభుత్వాలు వాడుకున్నట్లు ఆరోపించారు. గిరిజన స్వయం ఉపాధిని ప్రభుత్వం దెబ్బ తీస్తుందని విమర్శించారు. సొసైటీలను ఏర్పాటు చేసుకుని ఇసుకను ప్రభుత్వానికి అమ్మే క్రమంలో లేబర్, మెయింటనెన్స్, ఇతర ఖర్చులన్నీ గిరిజన సొసైటీల మీద పడుతున్నాయన్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి అవి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గిరిజన సొసైటీలకు చెందిన ఆదివాసీలు టీజీఎండీసీ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం ఉండటం లేదన్నారు. నాలుగేళ్లుగా బిల్లులు రాక దగాపడ్డ ఆదివాసీ బిడ్డలను ప్రభుత్వం కూడా దగా చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో మహేష్, గోపినాథ్, తదితరులు ఉన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న నర్సిమూర్తి

స్వర్ణం, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు

ఏటూరునాగారం: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో మండలకేంద్రానికి చెందిన ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు బాలుర టీం గోల్డ్ మెడల్, బాలికల టీం సిల్వర్ గెలుపొందినట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో సభ్యులను అభినందించారు. సిద్దిపేట జిల్లాలో ఈనెల 8, 9, 10తేదీల్లో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 14 బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలలో ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన అర్జున్ గోల్డ్‌మెడల్, మంచర్ల మన్విత శ్రీ సిల్వర్ మెడల్ సాధించారన్నారు.



గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులు

అవగాహన కలిగి ఉండాలి

భూపాలపల్లి అర్బన్: మీ సేవ కేంద్రాల ద్వారా రాబోయే నూతన సర్వీసులపై మీ సేవ నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని ఈ డిస్ట్రిక్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఈఎస్డీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని మీసేవ కేంద్రాల ఆపరేటర్లతో కలెక్టరేట్‌లో ఈడీఎం అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సేవలకు ప్రజల నుంచి రుసుం తీసుకోవాలని సూచించారు. అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంలు రమేష్, రాకేష్, జిల్లాలోని మీసేవ కేంద్రాల ఆపరేటర్లు పాల్గొన్నారు.

భక్తుల సందడి



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు



లక్ష వత్తులు వెలిగిస్తున్న భక్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక, అర్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్ష వత్తులు వెలిగించారు. దీంతో గోదావరితీరం, ఆలయ పరిసరాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. సుమారుగా 20వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అధికారులు అంచనావేశారు. ఆదివారం ఆలయానికి వివిధ పూజలు, లడ్డూ ప్రసాదాలతో రూ.4.30లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ మారుతి తెలిపారు.

సమాజ చైతన్య దిక్సూచి గద్దర్


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే,తదితరులు

నయీంనగర్: 'ప్రజా యుద్ధ నౌక గద్దర్ పాటలు విని ఎంతోమంది చైతన్యవంతులయ్యారు.. అందులో నేను ఒకరిని' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన గద్దర్ రచించిన లష్కర్, అండర్‌గ్రౌండ్, తరగని గని, పాటకు జీవకణం పుస్తకాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పాల్గొని గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చేసిన పోరాటాలను కొనియాడారు. గద్దర్ ఫౌండేషన్‌కు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. పుస్తకాల ఆవిష్కర్త పాశం యాదగిరి మాట్లాడుతూ.. గద్దర్ తన కవితలు, ఆటపాటలతో దేశ వ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేశాడన్నారు. తెలంగాణ కోసం పాడుతూ జనాన్ని చైతన్యం చేశాడన్నారు. కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. గద్దర్ ఉద్యమం ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎన్నికల ద్వారా తెలంగాణ రాలేదని, ఉద్యమం ద్వారా మాత్రమే రాష్ట్రం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో గద్దర్ పుస్తకాల సంపాదకులు జగన్ రెడ్డి, జిలుకర శ్రీనివాస్, సాయిని నరేందర్, అనిశెట్టి రజిత, బిల్లా మహేందర్, తాడిశెట్టి క్రాంతికుమార్, సోమ రామమూర్తి, కళాకారులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు


విజేతలతో హనుమకొండ సీఐ సతీశ్, నిర్వహణ కార్యదర్శి కన్నా

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-13 చెస్ పోటీలు ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వరంగల్ నుంచి మరింత మంది గ్రాండ్ మాస్టర్లు రావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70మంది క్రీడాకారులు హాజరైనట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. వరుసగా నాలుగు స్థానాల్లో కే హాస్మిత, అలుపుల హరిప్రియ, శ్రీహిత పి, రేపాక ఆరాధ్యారెడ్డి, బాలుర విభాగంలో రిత్విక్ గుండు, అల్లాడి శ్రీవాట్సన్, సాయిజోషి బొల్లం, గుర్రపు విద్యాధన్ విజేతలుగా నిలిచారని తెలిపారు. వీరు డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బైబై టెక్నోజియాన్-24



- నిట్‌లో ముగిసిన సాంకేతిక మహోత్సవం
- డీజే నైట్‌లో ఉర్రూతలూగించిన విద్యార్థులు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా ఈనెల 8 నుంచి నిర్వహించిన టెక్నోజియాన్-24 వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. వివిధ కళాశాలల నుంచి నిట్ వరంగల్‌కు విచ్చేసిన విద్యార్థులు బైబై టెక్నోజియాన్ అంటూ వీడ్కోలు పలికారు. ఈ వేడుకలు మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీలతో పాటు రోబోటిక్, మ్యూజిక్ క్లబ్‌లతో కూడిన 50కిపైగా ఈవెంట్స్ ప్రదర్శనలతో మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ముగింపు వేడుకల్లో భాగంగా పలు ఈవెంట్స్ ప్రదర్శనలతో పాటు రాత్రి నిట్ ఆడిటోరియం, సెమినార్ హాల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సాక్ మైదానంలో విద్యార్థులు ఆటా పాటాలతో డీజే నైట్‌లో హోరెత్తించారు.

వావ్.. వండర్ కాస్మోస్



'వావ్ వండర్ కాస్మోస్' వీక్షిద్దాం రండి అంటూ నిట్ వరంగల్ ఆస్ట్రానమీ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆస్ట్రానమీ, ప్లానెట్స్ తమ కక్షలో చేపట్టే వివిధ రకాల పనితీరును ఏకకాలంలో తెలుసుకునేందుకు వండర్ కాస్మోస్‌ను ఏర్పాటు చేశారు.

నా దగ్గర ఓ ఐడియా ఉంది..



నా దగ్గర ఓ స్టార్టప్ ఐడియా ఉంది. ప్రొడక్ట్ లాంచ్ చేస్తానంటూ.. మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ సొసైటీ రూపొందించిన ప్రొడక్ట్ లాంచ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలకు కార్యరూపాన్ని ఇచ్చారు. ప్రొడక్ట్ లాంచ్ ఐడియాలను వ్యక్తపరిచారు.

చివరి రోజు పలు ఈవెంట్స్ ఇలా..

సూపర్ ఈ-గేమ్స్..



నేటి ఆధునిక యుగంలో ఆండ్రాయిడ్ మొబైల్స్‌కు ఆకర్షితులైన చిన్నారుల మేధస్సును పెంపొందించేందుకు నిట్ విద్యార్థులు రూపొందించిన ఈ-గేమ్స్ అబ్బురపరిచాయి. ఈ గేమ్స్ విద్యార్థులు నువ్వా నేనా అంటూ పోటీ పడ్డారు. స్క్రీన్‌పై ఆడడం ఆనందంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

హుషారుగా లేజర్ షో..



ఒక్క సారిగా ఊపిరి బిగపట్టి కన్నులు ఆర్పకుండా చూడండి.. అద్భుతం చూపిస్తాం.. అంటూ ఎలక్ట్రానిక్ అమేచ్యూర్ అండ్ హెచ్ఏఎం క్లబ్ ఆధ్వర్యాన రూపొందించిన(ల్యాబ్రీంత్‌ను టేక్ ఏ బ్రీత్ వీఆర్ ల్యాబ్రీంత్) లేజర్ షో హుషారుగా సాగింది. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని లేజర్ లైట్స్ తాకకుండా గమ్యాన్ని చేరేందుకు పోటీపడ్డారు.

నేటినుంచి కేయూ దూరవిద్య పీజీ పరీక్షలు

- హాజరుకానున్న 2వేల మంది విద్యార్థులు
- తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం ఎంఏ, ఎంకామ్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ హెచ్ఆర్ఎం మొదటి సంవత్సరం (ఇయర్‌వైజ్‌స్కీం) ఎక్స్ అభ్యర్థులకు సోమవారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 11, 13, 19, 21, 23 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు పరీక్షలు నిర్వహించనున్నారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ ఆదివారం తెలిపారు. ఇదే పీజీకోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 12,14, 20, 23, 25వ తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు.

ఎమ్మెస్సీ కోర్సులు పరీక్షలు..

కేయూ దూరవిద్య ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ మొదటి సంవత్సరం (ఎక్స్ అభ్యర్థులకు) ఈనెల 11, 13, 19, 21వ తేదీల్లో, ఎమ్మెస్సీ మ్యాథ్స్ (ఎక్స్ అభ్యర్థులకు) పరీక్షలు ఈనెల 11,13,19, 21, 23 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. దూరవిద్య ఎమ్మెస్సీ ఆయా కోర్సుల విద్యార్థులకు ఈనెల 12,14, 20, 22 తేదీల్లో అలాగే మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 12, 14, 20,22, 25న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు నిర్వహిస్తారు.దూరవిద్య పీజీ పరీక్షలకు యూనివర్సిటీ పరిధిలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 9 మంది అబ్జర్వర్లనును నియమించారు. సుమారు 2వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ను కూడా నియమించామని తెలిపారు.

కౌలు రైతు పంట క్షేత్రాల ధ్వంసం

పత్తి, మిర్చి పంటలను దున్నిన దుండగులు
- 7 క్వింటాళ్ల పత్తి, 45 నాటు కోళ్లు అపహరణ
- రూ. 2 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- పోలీసులకు బాధిత కౌలు రైతు ఫిర్యాదు


దోజర్‌తో దున్నిన పత్తి పంటను చూపుతున్న కౌలు రైతు లింగయ్య

మరిపెడ రూరల్: కౌలు రైతు పంట క్షేత్రాలను ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. పత్తి, మిరప పంటలను దున్ని కోళ్ల ఫారం షెడ్డునూ ధ్వంసం చేశారు. పత్తి , నాటు కోళ్లను ఎత్తుకెళ్లారు. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తిని నష్టపరిచారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం శివారులో చోటు చేసుకోగా ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కౌలు రైతు కుంచెపు లింగయ్య ఓ వ్యక్తి వద్ద 18 ఎకరాలు కౌలుకు తీసుకుని 6 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాడు. ఇందులో ప్రతీ ఏడాది పత్తి, వరి, మిర్చి తోటతో పాటు నాటు కోళ్ల ఫారం నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రాంపురం గ్రామానికి చెందిన వెల్ది వెంకటేశ్వర్లు, అతడి అల్లుడు చౌగాని సతీశ్ మరికొంత మంది రెండు ట్రాక్టర్ల ద్వారా శుక్రవారం అర్ధరాత్రి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి అక్కడ బీభత్సం సృష్టించారు. రెండు ఎకరాల పత్తి పంట, 20 గుంటల మిర్చితోటను పూర్తిగా డోజర్‌తో దున్నారు. అంతటితో ఆగకుండా కోళ్ల ఫారం షెడ్డు, నివాసం ఉంటున్న షెడ్డును ధ్వంసం చేసి 45 కోళ్ల, 7 క్వింటాళ్ల పత్తిని ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లారు. అక్కడే ఉన్న గడ్డివాముకు నిప్పుపెట్టారు. కంప్యూటర్ కాంట, పురుగు మందు పిచికారీ చేసే చేతి పంపును కూడా వదలకుండా ధ్వంసం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం చేశారని బాధిత రైతు లింగయ్య బోరున విలపించాడు. ఈ విషయాన్ని శనివారం మరిపెడ పోలీస్ స్టేషన్‌లో సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు కౌలు రైతు లింగయ్య తెలిపాడు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే ఏజీఎం తనిఖీ


లోకోపైలెట్లు విధుల్లోకి వెళ్లే ముందు కంప్యూటర్ వద్ద నమోదు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న రైల్వే ఏజీఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ తనిఖీ నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న ఏజీఎం ఆగర్వాల్‌కు కాజీపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బద్దియ స్వాగతం పలికారు. అనంతరం ఏజీఎం కాజీపేట స్టేషన్ ఎదుట గల లోకోపైలెట్ విశ్రాంతి కార్యాలయం రన్నింగ్ రూంను తనిఖీ చేశారు. అక్కడి నుంచి రైల్వే లోకోపైలెట్ కార్యాలయం వెళ్లి తనిఖీలు చేపట్టి లోకోపైలెట్ల విధులు, సమస్యలను తెలుసుకున్నారు. కాజీపేట జంక్షన్ రైల్వే అభివృద్ధిపై స్థానిక రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కాజీపేట ఈఎల్ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత్‌కృష్ణసాయి, కాజీపేట డీఎల్ఎస్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట స్టేషన్‌మేనేజర్ అగ్గి రవీందర్, ఏరియా ఇన్‌స్పెక్టర్ రాజీవ్ చౌదరి పాల్గొన్నారు.

నేటినుంచి పదో జోనల్ క్రీడా పోటీలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాయపర్తి: మండలకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సోమవారం నుంచి పదో జోనల్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సరిత పేర్కొన్నారు. ఆదివారం క్రీడాప్రాంగణ ఏర్పాట్లను మల్టీజోనల్ అధికారి అలివేలు పరిశీలించినట్లు తెలిపారు.సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించనున్న క్రీడాపోటీల్లో 14 పాఠశాలలకు చెందిన 1190 మంది విద్యార్థినులు పాల్గొననున్నట్లు తెలిపారు. అండర్ 14, 17, 19 వి భాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హైడ్ బాల్, చదరంగం, క్యారం, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్ బాల్, అథ్లెటిక్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫేక్‌న్యూస్‌కు గూగుల్ చెక్

- సీనియర్ జర్నలిస్టు గోపగాని సప్తగిరి


మాట్లాడుతున్న గోపగాని సప్తగిరి

కేయూ క్యాంపస్ : వెబ్ ప్రపంచాన్ని తప్పుడు సమాచారం ముంచెస్తోందని, ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టేందుకు గుగూల్ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందని గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ ఫ్యాక్ట్ చెక్ ట్రైనర్ గోపగాని సప్తగిరి అన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యకేంద్రం (సీడీఓఈ)లోని జర్నలిజం విభాగంలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్ట్‌కు సంబంధించిన టూల్స్‌ను వినియోగించుకోవడం ద్వారా సోషల్‌మీడియాలో వస్తున్న ఫేక్ న్యూస్‌ను అరికట్టొచ్చని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థులకు ఫ్యాక్ట్ చెకింగ్‌పై సప్తగిరి అవగాహన కల్పించారు. ఫేక్‌న్యూస్‌ను కనిపెట్టేందుకు వాటి మూలాలు కనుక్కోవడానికి అవసరమైన పలు టూల్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధిపతి సంగనిమల్లేశ్వర్, అధ్యాపకులు కె. నర్సింహారావు, పి. వెంకటేశ్వర్లు, శంకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ మహిళా విజేత వరంగల్

- పురుషుల విభాగంలో రంగారెడ్డి..
- ముగిసిన అంతర్‌జిల్లా స్థాయి పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న మొదటి, రెండో స్థానంలో నిలిచిన వరంగల్, ఖమ్మం క్రీడాకారిణులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 70వ తెలంగాణ అంతర్‌జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే అన్నారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో పురుషుల విభాగంలో రంగారెడ్డి జట్టు గెలుపొందింది. హైదరాబాద్ రెండో స్థానంలో, వరంగల్ మూడు, మెదక్ నాలుగో స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో వరంగల్ గెలుపొందింది. ఖమ్మం రెండో స్థానంలో, ఆదిలాబాద్ మూడు, నల్లగొండ నాలుగో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, బీబీఎఫ్ఐ చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్, ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, టోర్నమెంట్ చైర్మన్ రవీందర్‌కుమార్, అసోసియేషన్ సెక్రటరీ వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజశ్రీ కోళ్లతో అధిక లాభాలు

- పెరట్లో పెంపకానికి అనుకూలం
- యువతకు ఉపాధి, రైతులకు లాభదాయకం
- పోషణ ఖర్చు కూడా తక్కువే
- కేవీకే పశువైద్య శాస్త్రవేత్తల సూచనలు


రాజశ్రీ కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శశాంక్(ఫైల్)

ఖిలా వరంగల్ : వ్యవసాయ రంగంలో వివిధ పంటల సాగు చేసి అనేక ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు ఆలోచిస్తున్నారు. పెట్టుబడి సామర్థ్యం, ఓపిక ఉన్న అన్నదాతలకు వనరాజా, గ్రామప్రియ, రాజశ్రీ వంటి కోడి పిల్లల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పెంపకానికి ఉపయోగపడే పెరటి కోళ్లను ఇంటిళ్లపాదితోపాటు రైతులు, ఎస్సీ, ఎస్టీలు పెంపకానికి తీసుకెళ్తున్నారు. జిల్లాలోని 1,200 మంది రైతులకు 12వేల కోళ్లను ఉచితంగా కేవీకే ద్వారా అందజేస్తున్నారు. గ్రామీణులతో పాటు ఎస్సీ, ఎస్టీ యువతకు కోళ్ల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. రాజశ్రీ కోళ్లతో పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం లభిస్తుంది.



నాటుకోడిని పోలి ఉండే రాజశ్రీ..

కోళ్ల పెంపకం పరిశ్రమల స్థాయికి ఎదిగినా..గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. నాటుకోళ్ల ఉత్పాదక శక్తి తగ్గడం, రోగాల బారిన పడడం, ఎక్కువ కాలం పొదగడం వంటి కారణాలతో పెరటి కోళ్ల పెంపకం తగ్గింది. అయితే మామునూరు కేవీకే ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు, గృహిణీలకు స్వయం ఉపాధిని అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజశ్రీ పెరటి కోళ్లను ఒక్కో రైతుకు 10 కోళ్ల చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు. ఇవి అధిక ఉత్పాదక శక్తి కలిగి ఉండి ఏడాదికి 160 నుంచి 180 వరకు గుడ్లు ఇస్తాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ, పోషణ ఖర్చు తక్కువ, వీటి గుడ్లు నాటు కోడి గుడ్లు కన్నా పెద్దగా ఉంటాయి. పుంజుల్లో ఎదుగుదల నాటు కోళ్లతో పోలిస్తే వేగంగా ఉండి మనిషికి మచ్చికవుతాయి. రాజశ్రీ రకానికి చెందిన కోడి గుడ్లను నాటుకోడి ద్వారా, ఇంక్యూలేటర్ ద్వారా గానీ పెట్టి పిల్లలను పొందొచ్చు.

ఆరోగ్య జాగ్రత్తలు

కోళ్లకు రోజు శుభ్రమైన నీటిని అందించాలి. వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. పెరటి కోళ్లకు వచ్చే వ్యాధులలో కొక్కెర, మారెక్స్, గంబోరో, అమ్మతల్లి వంటి వైరల్ వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులు రాకుండా కాక్సిడియోసిస్, సాల్మోనెల్లోసిస్, కోరైజా మొదలగు వ్యాధులు సూక్ష్మజీవుల వల్ల సోకే ఆస్కారం ఉంది. కాబట్టి పెరటి కోళ్లలో వ్యాధులను నివారించడానికి మారెక్స్ టీకా మొదటి రోజు, కొక్కెర టీకాను 7వ రోజు, 28వ రోజు, 56వ రోజు, గంబోరో టీకాను 14వ రోజు, 21 రోజు, అమ్మతల్లి టీకాను 35వ రోజు విధిగా ఇవ్వాలి. అంతేకాకుండా పెరటి కోళ్లను బాహ్య, అంతర పరాన్నజీవుల నుంచి కాపాడుటకు ప్రతి రెండు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాగించాలి.

ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటాయి



అధిక ఉత్పాదక శక్తి కలిగి ఉన్న రాజశ్రీ కోళ్ల ఏడాదికి 180 వరకు గుడ్లు పెడతాయి. నాటుకోళ్లను పోలి ఉండే ఈ కోళ్ల ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి. జిల్లాలో 1,200 మంది రైతులు రాజశ్రీ కోళ్లను పెంచుతున్నారు. వీటిని పెంచిన రైతులు అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

– శశాంక్ పశువైద్య శాస్త్రవేత్త, కేవీకే, మామునూరు

అదుపు తప్పిన బైక్.. యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- మొట్లపల్లిలో ఘటన


సతీశ్ (ఫైల్)

మొగుళ్లపల్లి: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదం సతీశ్ (38) జమ్మికుంటలోని ఎఫ్‌సీఐలో హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జయభారతి స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నూకల శ్యామ్‌కు శనివారం సెలవుదినం కావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. గాదం సతీశ్..నూకల శ్యామ్‌కు ఫోన్ చేసి కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం సిరిసేడు గ్రామంలో శుభకార్యానికి రావాలని తెలపగా శ్యామ్ అక్కడికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇద్దరూ తిరిగి రాత్రి మొట్లపల్లికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో బైక్ లోయలో పడడంతో సతీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్యామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్యామ్‌ను ఆదివారం ఉదయం అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు చూసి 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

నర్సంపేట రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం నర్సంపేట మండలం రాములునాయక్‌తండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన వైనాల కొమురయ్య (52) నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండాలో తెలిసినవారి ఇంటికి వెళ్లగా అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య వైనాల సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఓదెలు (ఫైల్)

నడికూడ: అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పరకాల పోలీసుల కథనం ప్రకారం.. నడికూడ గ్రామానికి చెందిన గోనెల ఓదెలు (58)తన కూతురు పెళ్లి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం ఉదయం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.

పంచారామాలకు బస్సు సౌకర్యం


పంచారామాల బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్

హన్మకొండ: భక్తుల సౌకర్యార్థం పంచారామాలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భాను కిరణ్ తెలిపారు. ఆదివారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో పంచారామాలకు వెళ్తున్న బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందన్నారు. కార్తీక సోమవారం రోజున దైవదర్శనం చేసుకునేలా ఈ నెల 17, 24, డిసెంబర్ 1న కూడా పంచారామాలకు బస్సు నడపనున్నట్లు వివరించారు. అమరావతి అమరలింగేశ్వర స్వామి, భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర లింగేశ్వర స్వామి, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి దర్శించుకునేలా ఈ టూర్ ప్యాకేజీని రూపొందించినట్లు వివరించారు. ఆదివారం రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. డీలక్స్ సర్వీస్ చార్జీలు పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1200 నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు రిజర్వేషన్లు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7382855492, 9959226056, 9959226047 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రామప్పను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి దంపతులు


పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ దంపతులు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ దంపతులు ఆదివారం సందర్శించారు. జిల్లా జడ్జి ఎస్.వి.పి సూర్య చంద్రకళ, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యాలాల్, అదనపు సివిల్ జడ్జి సౌఖ్య, ఎస్పీ శబరీశ్.. స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సుజయ్ పాల్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.